క్లుప్తంగా

కోర్టు తీర్పు హర్షణీయం


మాట్లాడుతున్న శ్రీనివాస్

చుంచుపల్లి: చనిపోయిన చిరుత పులి గోర్లు తస్కరించిన కేసు విషయంలో సోమవారం కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ ఇచ్చిన తీర్పు హర్షణీయమని రామవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మరకల లక్ష్మారెడ్డికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు. 2016లో రామవరం రేంజ్ పరిధిలో ఈ కేసు నమోదు చేశారని, విచారణలో చిరుతపులులు విషపూరిత మేకలను తినడం వల్ల మృతి చెందినట్లు తేలిందని వాటి మృతదేహాల నుంచి గోర్లు తీసినట్లు మరకల లక్ష్మారెడ్డిపై నేరం రుజువుకావటంతో శిక్ష పడిందని వెల్లడించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున నాగలక్ష్మి, విశ్వశాంతి వాదనలు వినిపించారని, న్యాయస్థానం తీర్పు అటవీ శాఖ కృషికి పెద్ద విజయంగా నిలిచిందన్నారు. సమావేశంలో రామవరం రేంజ్ అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో ముగ్గురికి చోటు


పి.రవీందర్‌రెడ్డి

పాల్వంచ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) రాష్ట్ర కార్యవర్గంలోకి కేటీపీఎస్ 5, 6 దశలకు చెందిన ముగ్గురు నాయకులకు చోటు లభించింది. సోమవారం హైదరాబాద్ కొత్తపేటలోని రాజధాని గార్డెన్‌లో 1104 రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్టేట్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలుగా బి.శ్రీనివాసరావు, పి.రవీందర్‌రెడ్డి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.గణపతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజేందర్, జెన్‌కో అధ్యక్షుడు కేశబోయిన కోటేశ్వరరావు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ


పతకాలు చూపుతున్న విద్యార్థులు

పాల్వంచ: ఈ నెల 10, 11 తేదీల్లో హైదరాబాద్ సఫిల్గుడా పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్వంచ కేటీపీఎస్ డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, లాన్‌టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు బహుమతులు సాధించారు. వీరిలో 30 మంది క్రీడాకారులు నవంబర్ 22, 23, 24 తేదీల్లో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం నైస్ షాజీ, పీఈటీలు ఎ.శ్యాం, ఎస్.రామస్వామిదాస్ అభినందించారు.

సీఐకి సన్మానం..


సీఐ ప్రతాప్‌ను సన్మానిస్తున్న మద్దెల శివకుమార్, చింతచెర్వు గెర్షోము

కొత్తగూడెంటౌన్: రామవరం టూటౌన్ సీఐ ప్రతాప్‌ను సోమవారం అంబేడ్కర్ సంక్షేమ సంఘం బాధ్యుడు, కవి, రచయిత మద్దెల శివకుమార్, గాంధీ పథం చారిటబుల్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోము మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా టూటౌన్‌లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు: కిడ్నీ బాధితుల కోసం జూలూరుపాడు పీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడారు. మండలవ్యాప్తంగా డయాలసిస్ పేషెంట్లు ఉన్నారని, వీరంతా జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వెళ్తే బెడ్లు ఖాళీగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పసుపులేటి పవన్, వినోద్ కుమార్, వంశీ, రవి, కిశోర్, సురేశ్ పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి అక్కడే..

- పోలీస్ స్టేషన్లలో మగ్గుతున్న వాహనాలు
- తుప్పు పట్టి పాడైపోతున్న వైనం
- సీజ్ చేసినవి తీసుకెళ్లేందుకు పలువురి నిరాసక్తత
- వేలం ఆలస్యంతో నానాటికీ పెరుగుతున్న సంఖ్య


లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా, ఇతర కేసుల్లో పోలీసులు సీజ్ చేసే వాహనాలు నెలల తరబడి స్టేషన్లలో మగ్గుతున్నాయి. ఎండకు ఎండి, వానకు తడుస్తుండడంతో తుప్పు పడుతున్నాయి. సీజ్ అయిన వాహనాలను తీసుకెళ్లడంలో యజమానుల పట్టింపు లేనితనం.. ఆరు నెలల వ్యవధిలో వేలం వేయాల్సి ఉన్నా జాప్యం జరుగుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 28 పోలీసుస్టేషన్లు, రెండు ట్రాఫిక్ పోలీసుస్టేషన్లలో 400కి పైగా వాహనాలు సీజ్ అయినట్లు తెలుస్తోంది. ప్రతీ పోలీసుస్టేషన్‌లో కనీసం 20కి పైగా వాహనాలు ఉండగా, యజమానులు ధ్రువీకరణ పత్రాలను చూపించి, జరిమానా చెల్లించి తీసుకువెళ్లాలి. కానీ కొందరు వదిలేయడంతో వాహనాలు తుప్పుపట్టిపోతున్నాయి.

మాయమవుతున్న విడి భాగాలు..?

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల యజమానులు రాక నెలల తరబడి పోలీస్ స్టేషన్లలో ఉంటున్నాయి. ఇందులో అన్నీ బాగున్న కొన్ని వాహనాలను సిబ్బంది కొందరు వినియోగిస్తూ యథావిధిగా పోలీస్ స్టేషన్లలో పెడుతున్నారనే విమర్శలున్నాయి. ఇంకొన్ని ఘటనల్లో వాహనాల విడిభాగాలు మాయమవుతున్నాయని తెలుస్తోంది. దీంతో నెలల తర్వాత యజమానులు వచ్చినా వాహనాలు పనికి రాకపోగా.. వేలం వేసినా సరైన ధర వచ్చే పరిస్థితి కానరావడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

నిబంధనలు ఇలా..

రకరకాల కారణాలతో సీజ్ చేసిన వాహనాలను పోలీస్ స్టేషన్‌లో రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయాలి. అలా చేసిన వాహనాలను ఆరు నెలలకోసారి వేలం వేయాల్సి ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాహనాలు ఏళ్ల తరబడి మగ్గుతూ తుప్పు పడుతున్నాయి. వేలంతో వచ్చే కొద్దిపాటి ఆదాయం కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది.

త్వరలోనే వాహనాలకు వేలం నిర్వహిస్తాం..



వాహనాలను సీజ్ చేసిన ప్రతీ ఆరు నెలలకోసారి హెడ్ క్వార్టర్స్‌లో వేలం ద్వారా అమ్మకాలు జరుపుతున్నాం. సరైన పత్రాలు లేని వాహనాలను స్టేషన్లలో భద్రపరుస్తాం. ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో వాహనాలు ఉన్నాయి. వీటికి సంబంధించి త్వరలోనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వేలం నిర్వహిస్తాం.

–అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం

సురక్షిత తాగునీరు అందిస్తాం..


వాగు చప్టాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: పేద ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల పర్యటనలో భాగంగా చింతోనిచెలక తండాలో మంజూరైన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన ట్యాంకు నిర్మాణం పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చింతలతండా – గుండ్లమడుగు మధ్యలో ఉన్న పుణ్యపువాగు చప్టాను పరిశీలించారు. ఏటా వానాకాలంలో వరద ఉధృతి కారణంగా ఇక్కడ రాకపోకలు నిలిచిపోతుంటాయని హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేని కోరారు. బ్రిడ్జి నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోరం సురేందర్, లక్కినేని సురేందర్, ఏలూరి కోటేశ్వరరావు, రెడ్యానాయక్, ఈది గణేశ్, బోడ సరిత, మధు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కోతుల హల్‌చల్

సుజాతనగర్: మండలంలో వానరమూకలు సృష్టిస్తోన్న అలజడి అంతా ఇంతా కాదు. సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కోతుల గుంపు సృష్టించిన హైరానాతో ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు భోజనం వడ్డించే క్రమంలో కోతులు వచ్చి హల్‌చల్ చేశాయి. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి పరుగులు పెట్టారు. చివరకు కొందరు గ్రామస్తులు కర్రలతో పాఠశాలకు చేరుకొని కోతులను బయటకు తరిమారు. కోతుల ఆగడాలకు చెక్ పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పలు నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరు

సుజాతనగర్: మండల కేంద్రంలో నిర్మించనున్న బస్ షెల్టర్, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్‌లో మరుగుదొడ్లకు రూ.10 లక్షలు, మండల కేంద్రంతో పాటు, వేపలగడ్డ గ్రామ సెంటర్లో బస్ షెల్టర్ నిర్మాణాలకు రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే నిధులతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటనలో వివరించారు.

నిబంధనలు పాటించాలి..


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: దీపావళి పండుగ టపాసుల దుకాణాదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డీఎస్పీ ఎన్.చంద్రభాను సూచించారు. సోమవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో టపాసుల దుకాణాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దుకాణాల మధ్య దూరం ఉండాలని, ఫైర్ సేఫ్టీ పరికరాలు, నీరు, ఇసుక అందుబాటులో ఉండాలని సూచించారు. అగ్నిమాపక శకటం మైదానంలో ఉంచాలని సూచించారు. ఈ దఫా ఇల్లెందు పట్టణంలో దీపావళి మందుల దుకాణాలకు 27 మంది అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సమావేశంలో సీఐ సురేశ్, ఎస్ఐ సూర్య, సిబ్బంది, బాణసంచా దుకాణాదారులు పాల్గొన్నారు.

తూకంలో మోసం.. ధరలో దగా..

- కూరగాయల రైతు నిలువుదోపిడీ
- కలగానే మద్దతు ధర
- వ్యాపారులు చెప్పిన ధరకే తప్పనిసరి విక్రయం
- పెట్టుబడి కూడా రావడం లేదని రైతుల ఆవేదన


రైతులు సాగు చేస్తున్న బీర కాయ తోట

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఏజెన్సీలో ప్రస్తుతం బీరకాయ విస్తారంగా పండుతోంది. కాయను కోసిన రైతుల నుంచి దళారులు కిలో రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు, దళారీ కమీషన్ మొత్తంగా కిలోకు రూ.3 వరకు రైతులే భరిస్తున్నారు. అంటే కిలో విక్రయిస్తే రైతుకు అందిన ధర రూ.15 మాత్రమే. కానీ, బహిరంగ మార్కెట్‌లో వాటిని కిలో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. దీనిని బట్టి పండించిన రైతుకు దక్కుతున్నది ఎంత.. దళారీకి ఎంత మిగులుతోంది.. అనేది ఇట్టే అర్థమవుతోంది. ఇది ఒక్క బీరకాయ విషయంలోనే కాదు.. ఇతర కూరగాయలన్నింటిలోనూ ఇదే జరుగుతోంది..

ఏడాది పొడవునా కూరగాయల సాగు

ఇల్లెందు ఏజెన్సీలో మండుటెండలో కాకర పంటతో ఏటా కూరగాయల సాగు ప్రారంభమవుతోంది. ఇలా ఏడాది పొడవునా కాకరతోపాటు బీర, వంకాయ, బెండకాయ, కాలీఫ్లవర్, టమాట, దోస, గోరుచిక్కుడు, సొరకాయ, బుడమకాయ, చిక్కుడు, ఆకుకూరలు వంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రధాన మార్కెట్‌లకు ఇల్లెందు ఏజెన్సీ నుంచే అత్యధికంగా కూరగాయలు ఎగుమతి అవుతున్నాయి. ఇలా ఇల్లెందు ఏజెన్సీలో వందల సంఖ్యలో కుటుంబాలు కూరగాయల సాగుపై ఆధారపడి జీవిస్తున్నాయి.

అడుగడుగునా మోసమే..

మే నెల నుంచే అత్యధిక సమయం చేనులోనే ఏదో ఒక పని చేసుకుంటూ శ్రమిస్తున్న రైతులు జూన్ చివరి నుంచి కాకర పంటను విక్రయించడం ప్రారంభిస్తారు. ఆ తరువాత ఇతర పంటలను సాగు చేయడం విక్రయించడం కొనసాగుతోంది. విక్రయాల ప్రారంభంలో మంచి ధర చూపిస్తున్న దళారులు పంట అధికంగా చేతికొచ్చే సమయంలో ధర తగ్గిస్తూ ఉండటం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఆరుగాలం కష్టాన్ని భరిస్తూ సాగులో నిమగ్నమవుతున్న రైతు కూరగాయల విక్రయ సమయంలో మాత్రం పెట్టుబడి అయినా చేతికందుతుందో.. లేదో.. అన్న భయంతో మార్కెట్ వైపు అడుగులు వేస్తున్నాడు. చేను నుంచి పంటను బస్తాల్లో మూటకట్టుకొని మార్కెట్‌కు వెళ్లిన రైతును మందుస్తుగా తూకం సమయంలోనే దళారులు మోసం చేస్తున్నారు. బస్తా బరువులో 5 కిలోలు తరుగు తీయడంలోనే మోసం బహిర్గతమవుతోంది. ఇక ధర విషయానికొస్తే రైతు నుంచి కొనుగోలు చేసిన పంటను రెట్టింపు ధరకు వినియోగదారులకు విక్రయిస్తున్నారు.

అధికారుల ప్రేక్షక పాత్ర

కూరగాయలకు మద్దతు ధర కల్పించడంలో ఎలాగూ పట్టింపులేకుండా వ్యవహరిస్తున్న అధికారులు కనీసం మార్కెట్‌లో జరుగుతున్న మోసాలపై కూడా దృష్టిసారించకపోవడం దారుణమని రైతులు అంటున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు ఇల్లెందులో పర్యటించి తనిఖీ చేసిన దాఖలాలు లేవనే చెప్పాలి. రెవెన్యూ అధికారులు అది తమ పని కాదనట్లుగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

రైతు బజార్ ఏర్పాటే పరిష్కారం

ఇల్లెందు ఏజెన్సీలో విస్తారంగా కూరగాయల సాగు చేపడుతున్నారు. కానీ రైతులు నేరుగా తమ పంటలను విక్రయించుకునే అవకాశం లేకపోవడంతో దళారులు చెప్పిన ధరలకు విక్రయించుకోవాల్సి వస్తోంది. వందల ఎకరాల్లో కూరగాయల సాగు చేస్తూ జిల్లాలోని అన్ని మార్కెట్‌లకు కూరగాయలను ఎగుమతి చేస్తున్న తాము మంచి లాభాలు గడించేందుకు ఇల్లెందులో రైతుబజార్ ఏర్పాటు చేయడమే పరిష్కారమని రైతులు చెబుతున్నారు. గతంలో రైతుబజార్ ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికి స్థలం కేటాయించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో ఆచరణకు నోచుకోలేదు.

కిలో రూ.23కి విక్రయించా..



ఎకరం విస్తీర్ణంలో బీరసాగు చేస్తున్నాను. ఇల్లెందులో ధర మరీ తక్కువగా ఉండటంతో కొత్తగూడెం మార్కెట్‌లో కిలో బీరకాయ రూ.23కు విక్రయించాను. రవాణా, హమాలీ చార్జీ, దళారీ కమీషన్ పోను కిలోకు రూ.18 మిగిలింది.

–వాంకుడోత్ బాలు, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇంటి స్థలాలు మంజూరు చేసి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చుంచుపల్లి మండలం కొమరంభీం వెంకటేశ్వర కాలనీలో 1/70 చట్టం పరిధిలో సర్వే నంబర్ 137/12–ఏలో ఉన్న ప్రభుత్వ భూమి 20 ఎకరాల్లో పదేళ్లుగా నివాసం ఉంటున్న ఎస్టీ కోయ, లంబాడా ఇతర కులాల వారు గుడిసెలు వేసుకుని, నివాసం ఉంటున్నారని, కుటుంబ పోషణ కోసం హోటళ్లు, షాపులు, ఇళ్లల్లో కూలీలు పనిచేస్తున్నారని తెలిపారు. ఇంటి స్థలం కుటుంబానికి 121 గజాలు చూపించాలని కోర్టు రెండు దఫాలుగా ఆర్డర్లు ఇచ్చి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో రామచందర్, గణేష్, ఊక్లా, బాద్‌షా, మోహన్‌రావు, మహేష్, కోరం కాంతమ్మ, నందిని, శారద, మురళి, మంగయ్య, బానోత్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న డిప్యూటీ లా మేనేజర్ మల్లేశ్

కొత్తగూడెంఅర్బన్: న్యాయ సంబంధిత విషయాలతో పాటు పలు అంశాలపై సింగరేణిలో నూతనంగా చేరిన మేనేజ్‌మెంట్ ట్రైనీ (పర్సనల్), జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్లు, వెల్ఫేర్ ఆఫీసర్ (ట్రైనీ)లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగిన శిక్షణలో డిప్యూటీ లా మేనేజర్ ఎం.మల్లేశ్ మాట్లాడారు. కోర్టు కేసుల్లో సంస్థ తరపున సమాధానం ఇవ్వడం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. హెచ్‌ఆర్‌డీ డీవైపీఎం మైత్రేయ బంధు, సీనియర్ అసిస్టెంట్ కె.సందీప్ పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయండి..


మాట్లాడుతున్న మడత వెంకట్‌గౌడ్

ఇల్లెందు: బీసీలకు చట్ట సభల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు కోరుతూ ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల ఐక్య వేదిక బాధ్యులు కోరారు. సోమవారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీసీ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో బీసీ సంఘాల నేతలు గోచికొండ సత్యనారాయణ, దిండిగాల రాజేందర్, మడత వెంకట్‌గౌడ్, మడుగు సాంబమూర్తి, బాస శ్రీనివాస్, ఎస్ఐ నబీ, పింగలి నరేశ్, ఎస్.రంగనాథ్, బోళ్ల సూర్యం, బంధం నాగయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో 56 శాతం వరకు బీసీలుండగా చట్ట సభల్లో రాజ్యాధికారంలో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అత్యంత తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరి మార్చుకుని బీసీలకు చట్ట సభలు, విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, వెంకన్న, చిల్లా శ్రీను, మేకల మల్లేశ్‌యాదవ్, వీరస్వామి, అబ్దుల్ నబీ, మెరుగు కార్తీక్ యాదవ్, మహబూబ్ పాల్గొన్నారు.

వర్షంతో పంటలకు నష్టం


రోడ్డుపై ఆరబోసిన మక్కలు

ఇల్లెందురూరల్: మండలంలో ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షం వరి రైతులకు మేలు చేకూర్చగా పత్తి, మిర్చి, మొక్కజొన్న రైతులను కలవరపాటుకు గురిచేసింది. మొక్కజొన్న పంట కాలం పూర్తికావడంతో కంకులు విరిచి కండె నుంచి గింజలు వేరు చేసిన రైతులు రహదారులు, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో గింజలు తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నా భారీ వర్షంతో గింజలను తేమ ఆవహించింది. దీంతో సోమవారం వర్షం తగ్గుముఖం పట్టగానే రహదారులపై ఆరబెట్టుకున్నారు. ఇక మిర్చి మొక్కలు ఇప్పుడిప్పుడే నాటుకుంటున్న తరుణంలో కురిసిన వర్షంతో కొన్ని చోట్ల మొక్కలు వాలిపోయాయి. పత్తి కాయ విచ్చుకునే సమయంలో కురిసిన వర్షం పంటకు నష్టం చేస్తుందని రైతులు వాపోతున్నారు.

నిర్లక్ష్య ధోరణితో విద్యార్థుల అవస్థ


నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

టేకులపల్లి: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆశ్రమ పాఠశాలలు, పీఎంహెచ్ హాస్టల్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, విద్యార్థులే వంటలు వండాల్సిన దుస్థితి ఏర్పడిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వి.విజయ్ విమర్శించారు. సోమవారం టేకులపల్లిలోని హాస్టళ్ల వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హాస్టల్ వర్కర్లు సమ్మెలో ఉండటంతో వంటలు, పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయని, దీంతో విద్యార్థులు అనివార్యంగా వంట చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. దసరా సెలవుల తరువాత చాలామంది విద్యార్థులు రాలేదని, వచ్చిన వారు కొందరు ఇంటిబాట పట్టారని చెప్పారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వర్కర్ల సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇతరులపై మానవత్వం చూపాలి..


ఖాసీంను సన్మానిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: కుల, మతాలకు అతీతంగా మానవత్వం చూపాలని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఒడ్డుగూడెంనకు చెందిన షేక్ ఖాసీం, పాత పాల్వంచకు చెందిన షేక్ జానీమియా, మహ్మద్ యూసుఫ్‌బాబా, మహ్మద్ ఖాదర్‌బాబు, షేక్. యాకూబ్‌మియా, షేక్.రహీంలు హజ్ (ఉమ్రా) యాత్రకు వెళ్లి వచ్చాక సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని మతాల సారాంశం పరోపకారం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్‌వీఆర్‌కె.ఆచార్యులు, పైడిపల్లి మహేశ్, ఉండేటి శాంతివర్ధన్, కె.రామశేషంరాజు, చింతలచెర్వు రమేశ్, ఎస్కే చాంద్‌మియా, అహ్మద్ జానీ, యాకూబ్, అక్బర్, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాతండాలో పోషణ మాసోత్సవం


మాట్లాడుతున్న ప్రాజెక్టు సూపర్‌వైజర్ కొమురమ్మ

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ రాజ్యాతండా గ్రామ అంగన్‌వాడీ పాఠశాలలో సోమవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సూపర్‌వైజర్ కొమురమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పాఠశాలల్లో నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నామని, బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా హాజరై వాటిని తీసుకోవాలని, విశ్రాంతి, నిద్ర తగిన విధంగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, చంద్రకళ, సుభద్ర, ఉమ, మంగ, రేణుక తదితరులు పాల్గొన్నారు.